క్లుప్తంగా

కార్మిక కుటుంబాలకు పరిహారం అందజేయాలి

వాంకిడి: కువైట్ అగ్ని ప్రమాదంలో, నాగ్‌పూర్ బాణాసంచా కర్మాగారంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని టీయూసీఐ (ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా) జిల్లా అధ్యక్షుడు గోగర్ల తిరుపతి డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించి బాధిత కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. అలాగే ప్రమాదాలకు కారణమైన కంపెనీలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎంపీ నగేశ్‌ను సన్మానించిన బీజేవైఎం నాయకులు



ఎంపీ నగేశ్‌ను సన్మానిస్తున్న సుచిత్, తదితరులు

వాంకిడి: నూతనంగా ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికైన గోడం నగేశ్‌ను బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఎలగతి సుచిత్ ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. బీజేవైఎం వాంకిడి మండల అధ్యక్షుడు మండోకార్ వికాస్, మండల కార్యదర్శి మహేశ్, వానేష్ పాల్గొన్నారు.

ఎస్పీఎం ఆధ్వర్యంలో శిక్షణ అభినందనీయం



సర్టిఫికెట్లు అందజేస్తున్న డీపీఆర్‌డీ సురేందర్

కాగజ్‌నగర్‌రూరల్: ఎస్పీఎం, స్పర్శ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్, కంప్యూటర్ నైపుణ్యంపై శిక్షణ ఇవ్వడం అభినందనీయమని జిల్లా ప్రాజెక్టు రూరల్ డైరెక్టర్ సురేందర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎస్పీఎం హెచ్‌ఆర్‌డీ హాల్‌లో నిర్వహించిన సర్టిఫికెట్ ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 250 మందికి కుట్టుమిషన్, కంప్యూటర్ నైపుణ్యంపై శిక్షణ ఇవ్వడం సంతోషదాయకమన్నారు. శిక్షణ పొందిన మహిళలకు స్త్రీనిధి నుంచి రూ.3 లక్షలు రుణ సదుపాయం అందిస్తామని పేర్కొన్నారు. మిల్లు వైస్‌ప్రెసిడెంట్ ఏకే మిశ్రా, జీఎం ఎంస్ గిరి మాట్లాడుతూ రానున్న రోజుల్లో వివిధ రంగాల్లో శిక్షణను ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు. మిల్లు ప్రతినిధులు గిరీశ్‌రాయ్, ఠాగూర్, రమేశ్‌రావు, నాగరాజు, రాణి బివాల్, తుమ్మ రమేశ్, నాగేశ్వర్‌రావు, శశికాంత్, తదితరులు పాల్గొన్నారు

పాడె మోసిన ఇన్‌చార్జి జెడ్పీ చైర్మన్ కృష్ణారావు



అగర్‌గూడలో పాడె మోస్తున్న కృష్ణారావు

పెంచికల్‌పేట్: అగర్‌గూడ గ్రామానికి చెందిన పూజరి బాపు అనారోగ్యంతో మృతి చెందగా శుక్రవారం అంతిమ యాత్రలో ఇన్‌చార్జి జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు పాల్గొని పాడె మోశారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

విద్యార్థులకు ఉచిత శిక్షణ ప్రారంభం

కాగజ్‌నగర్‌రూరల్: భేటీ బచావో- భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచిత బ్యూటీషియన్ శిక్షణ ప్రారంభించారు. ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహం మాట్లాడుతూ.. నైపుణ్య శిక్షణ కింద ఇచ్చే బ్యూటీషియన్ శిక్షణ కోర్సు విద్యార్థులకు ఉపయోగపడుతుందన్నారు. 45 రోజుల పలు అంశాలు బోధించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త బి.శారద, జెండర్ స్పెషలిస్టు రాణి, నిపుణురాలు రవళి, అధ్యాపకురాలు శారద, కృష్ణవేణి పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు ఎంపిక

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని మోడల్ స్కూల్‌కు చెందిన 19 మంది విద్యార్థులు జాతీయ ప్రతిభా ఉపకార వేతనాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. ఎంపిక విద్యార్థులను శుక్రవారం పాఠశాల ఆవరణలో అభినందించారు. ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 10న నిర్వహించిన పరీక్షలో కృష్ణవేణి, వైష్ణవి, శ్రీకాంత్, అలీజా షైజీన్, మీనాక్షి, రిషిత, మధుప్రియ, సాహిత్య, హరిచందన, స్రవంతి, అక్షర, విష్ణువర్ధన్, రాకేశ్, హర్షిత, శిరీష, రవిచంద్ర, తోఫిక్, పల్లవి, కైఫ్ అలీ ప్రతిభ చూపారన్నారు. వారికి కేంద్ర ప్రభుత్వం తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు ఏడాదికి రూ.12,000 చొప్పున ఉపకార వేతనం చెల్లిస్తుందన్నారు.

గుండివాసుల గోస!

- వర్షాకాలం వచ్చిందంటే నాటు పడవే దిక్కు
- పిల్లర్ దశలో వంతెన పనులు
- ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు



అసంపూర్తిగా వంతెన నిర్మాణం

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని గుండి వాగుపై వంతెన లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఏటా వర్షాకాలంలో వాగు ఉప్పొంగినప్పుడల్లా ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని నడుచుకుంటూ వాగు దాటుతున్నారు. వంతెన నిర్మాణం కోసం 2006లో శంకుస్థాపన చేయగా, పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ పనులను పిల్లర్ దశ వరకు చేసి నిలిపివేశారు. తిరిగి గత జనవరిలో పనులు ప్రారంభించినా నత్తనడకన కొనసాగుతుండడంతో ఈ వర్షాకాలంలో కూడ గ్రామస్తులకు ఇబ్బందులు తప్పేలా లేవు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరిస్తామని, వంతెన నిర్మాణం పూర్తయ్యే వరకు ఓటు వేయమని కలెక్టరేట్ ఎదుట గ్రామస్తులు నిరసన తెలిపారు. కానీ వివిధ పార్టీల నాయకులు హామీ ఇవ్వడంతో ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. అయినా ఇప్పటి వరకు వంతెన పనులు ముందుకు సాగడం లేదు. అదే పిల్లర్ దశలోనే నిలిచిపోయాయి.

పడరాని పాట్లు..

జిల్లా కేంద్రానికి 3 కిలోమీటర్ల దూరంలో ఉండి వంతెన లేకపోవడంతో 30 కిలోమీటర్లు తిరిగి జిల్లా కేంద్రానికి చేరుకోవాల్సిన పరిస్థితి ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. గుండి గ్రామానికి వెళ్లే వాగుపై వంతెన నిర్మాణం పూర్తి కాక గ్రామస్తులు పడరాని పాట్లు పడుతున్నారు. జిల్లా కేంద్రానికి చేరుకోవాలంటే దుబ్బాగూడ, కోమటిగూడ నుంచి తిరిగి రావాల్సిన పరిస్థితి వారిది. అత్యవసర పరిస్థితిలో కనీసం 108 కూడా రాక అనేక అవస్థలు పడుతున్నారు. వర్షాకాలంలో రైతులు ఎరువులు, విత్తనాలు, ఇతర పనులకు తప్పనిసరిగా జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిందే. ఆ సమయంలో వాగులు ఉప్పొంగితే రైతులతో పాటు పాఠశాల, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. 2006లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం వంతెన నిర్మాణానికి రూ. 3కోట్ల60 లక్షలు మంజూరు చేయగా శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. పిల్లర్ దశ వరకు పనులు చేసి వదిలేశారు. రీటెండరింగ్‌లో భాగంగా వంతెన నిర్మాణ పనుల కోసం రూ.3.25 కోట్లతో టెండర్ కూడా పూర్తయ్యింది. కానీ పనులు మాత్రం నెమ్మదిగా జరుగుతుండడంతో గ్రామస్తులకు తిప్పలు తప్పడం లేదు.

ఇదే తరహాలో మరిన్ని..

మండలంలోని అప్పపల్లి వాగుపై ఏప్రిల్‌లో రూ.1.86 లక్షలతో వంతెన పనులు ప్రారంభించారు. కానీ ఈ వర్షకాలంలో పనులు పూర్తయ్యేలా కనిపించడం లేదు. దీంతో ఈ వర్షాకాలంలో సైతం అప్పపల్లి, ఆర్‌ఆర్‌కాలనీ ప్రజలకు ఇబ్బందులు తప్పేలా లేవు. అంకుసాపూర్ గ్రామానికి వెళ్లే దారిలోని వాగుపై లోలెవల్ వంతెనతో వరదలు వచ్చినప్పుడు సుమారు 15 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి.



ఇటీవల వర్షానికి తెగిన తాత్కాలిక వంతెన

ఇబ్బందులు పడుతున్నాం



మా ఊరికి వెళ్లాలంటే వాగుకు వంతెన లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వర్షాకాలంలో వాగు ఉప్పొంగుతుంది. దీంతో ఎటూ వెళ్లలేని పరిస్థితి ఉంది. వంతెన పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా వంతెన మాత్రం పూర్తి కాలేదు.

– రవీందర్, గుండి

త్వరగా పూర్తి చేయాలి



అప్పపల్లి వాగుపై నిర్మిస్తున్న వంతెన పనుల్లో వేగం పెంచాలి. వర్షాకాలం మొదలైతే రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. సంబంధిత అధికారులు వంతెన నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలి.

– సాంబయ్య, అప్పపల్లి

మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలి



కౌటాలలో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న యువకులు

దహెగాం: పెద్దపల్లి జిల్లాలో చిన్నారిపై అత్యాచారం చేసి హత్య చేసిన మానవ మృగాన్ని కఠి నంగా శిక్షించాలని మండల ఆరె సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్, పోలీస్‌స్టేషన్‌లో నేరస్తుడిని కఠినంగా శిక్షించాలని వినతిపత్రాలు అందజేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం కఠినమైన చట్టాలు అమలు చేయాలన్నారు. నాయకులు చప్పిడి తిరుపతి, సురేశ్, దామోదర్, పుల్లం నారాయణ, సంజీవ్, మల్లేష్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

చింతలమానెపల్లి: సుల్తానాబాద్‌లో జరిగిన ఘటనపై విచారం వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలో శుక్రవారం నాయకులు చిన్నారి చిత్రపటానికి నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎంపీపీ డుబ్బుల నానయ్య, జెడ్పీటీసీ శ్రీదేవి, నాయకులు డుబ్బుల వెంకన్న, కుకుడ్‌కార్ రమేశ్, భద్రేస్, మారుతి, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: సుల్తానాబాద్‌లో జరిగిన ఘటనపై మానవ మృగాన్ని వెంటనే ఉరి తీయాలని డిమాండ్ చేస్తూ వివిధ సంఘాల, పార్టీల నాయకులు శుక్రవారం రాత్రి మండల కేంద్రంలో కౌటాల -కాగజ్‌నగర్ రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కొవ్వొత్తులతో ర్యాలీ తీసి బాలిక చిత్రపటానికి నివాళులర్పించారు. దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు అనిల్, బీఆర్‌ఎస్ నాయకులు శంకర్, వెంకటేశ్, సురేశ్, ఆనంద్, సందీప్, శంకర్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి: పెద్దపల్లిలో ఆరేళ్ల బాలికను అత్యాచారం చేసి హతమార్చిన దుండగుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రాత్రి ఆరె సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆరేళ్ల చిన్నారిని అత్యాచారం చేసి హతమార్చడం అమానుషం అన్నారు. వెంటనే పోలీసులు దుండగుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆరె సంఘం జిల్లా అధ్యక్షుడు బొట్టుపల్లి జైరాం, పీఏసీఎస్ చైర్మన్ జబోరె పెంటు, నాయకులు బోయిరె ప్రకాశ్, మండోకార్ విలాస్, మల్లయ్య, పెంటు, కోలె సదాశివ్, గణేశ్, పాల్గొన్నారు.

పర్మిట్లు ఇవ్వడంలో పాత విధానాన్ని అనుసరించాలి



వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

ఆసిఫాబాద్‌అర్బన్: కట్టె మిల్లుల నుంచి కొనుగోలు చేసే కర్రకు సంబంధించి పర్మిట్లు ఇవ్వడానికి నూతనంగా తీసుకొచ్చిన ఎలక్ట్రానిక్ విధానాన్ని రద్దు చేసి పాత విధానమైన ఆఫ్‌లైన్ విధానాన్ని అమలు చేయాలని సామిల్ టింబర్ మర్చంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మురళీధర్ డిమాండ్ చేశారు. సోమవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్ టిబ్రేవాల్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఆయన మాట్లాడుతూ నూతనంగా ఆన్‌లైన్ విధానం అమలు చేయడం వల్ల పర్మిట్లు జారీ చేయడంలో ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. దీంతో కోసిన కర్ర అమ్ముకోలేక అడ్వాన్సులు వాపస్ ఇవ్వాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. వెంటనే ప్రభుత్వ పెద్దలు, అటవీశాఖ అధికారులు స్పందించి పాత విధానాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఇరుకుల అంజనేయులు, నాయకులు అఖీల్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ సర్వే చేపట్టాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో అంజద్‌పాషా

కెరమెరి: అన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు మిషన్ భగీరథ సర్వే చేపట్టాలని ఎంపీడీవో అంజద్ పాషా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మరో వారం రోజులే గడువు ఉందని, సర్వే వేగవంతం చేయాలని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పల్లెప్రకృతి వనాలు, శ్మశాన వాటికలు, సెగ్రిగేషన్ షెడ్లు, క్రీడాప్రాంగణాలపై చర్చించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశ్వేశ్వరరావు, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, టీఏ, ఎఫ్‌ఏలు ఉన్నారు.

యూనిఫాం, పుస్తకాలు పంపిణీ



యూనిఫాంలు అందజేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ బడీడు పిల్లలు బడిలో ఉండాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, మానస, ఉపాధ్యాయులు స్వరూప, అనూష, సంధ్య, రమేశ్, రాజేశ్, ఎంపీటీసీ శోభ, సీఏ లావణ్య, మాజీ ఎంపీటీసీ సాంబయ్య, రాందాస్, బీమన్‌కార్ బాబురావు, గణపతి తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌అర్బన్: బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని చిర్రకుంట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యతో పాటు, మధ్యాహ్నం రుచికరమైన భోజనం, ఉచితంగా పుస్తకాలు, దుస్తులు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం తుంపల్లి ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు.

విద్యుత్ అదాలత్

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నజ్రూల్‌నగర్ గ్రామంలో శుక్రవారం విద్యుత్ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈసందర్భంగా విద్యుత్ వినియోగదారుల నుంచి పలు సమస్యలపై అర్జీలు స్వీకరించారు. 25 అర్జీలు రాగా, 21 అర్జీలను అప్పటికప్పుడే పరిష్కరించినట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. మిగతా త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. వినియోగదారుల నుంచి రూ.50 వేల పాత బకాయిలు వసూలు చేశారు. కార్యక్రమంలో డీఈఈ నాగరాజు, ఏడీఈ శ్రీనివాస్, ఈవో ఈశ్వర్, ఏఏవో తుకారాం తదితరులు పాల్గొన్నారు.

రెండో జాబితా విడుదల

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి రెండో ఎంపిక జాబితాను విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి జాబితాలో మిగిలిన సీట్లను భర్తీ కోసం విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. ఏడో తరగతిలో ఖాళీగా ఉన్న 2 సీట్లు, ఎనిమిదో తరగతిలో 3 సీట్ల జాబితాను కూడా విడదల చేస్తామన్నారు. జాబితాలోని విద్యార్థులు ఈ నెల 15, 18వ తేదీల్లో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాలని సూచించారు.

ముగిసిన ఈపీ ఆపరేటర్ల ప్రమోషన్ పరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీలో బెల్లంపల్లి రీజియన్ (శ్రీరాంపూర్, బెల్లంపల్లి, మందమర్రి) పరిధిలో పని చేసే ఈపీ ఆపరేటర్ల ప్రమోషన్ల కోసం నిర్వహిస్తున్న పరీక్షలు శుక్రవారం ముగిశాయి. రెండోరోజు సైతం అధికారులు ఈపీ ఆపరేటర్లకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించి యంత్రాలపై పని అనుభవం, పరిజ్ఞానంపై పలు రకాల ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. సీ గ్రేడ్ నుంచి బీ గ్రేడ్ ప్రమోషన్ కోసం నిర్వహించిన పరీక్షలకు 26 మంది ఈపీ ఆపరేటర్లు హాజరయ్యారు. ఎస్‌వోటూ జీఎం ఎం.నరేందర్, ఫిట్ ఇంజనీర్ వీరన్న, కార్పొరేట్ మెంబర్ శ్యాంసుందర్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, డీవైపీఎం వేణు, ఇంజనీర్లు మహేశ్వర్, కురేషీ పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో సౌకర్యాలు కల్పించాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



గ్రంథాలయంలో సౌకర్యాలపై ఆరా తీస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని గ్రంథాలయాల్లో పాఠకులు, విద్యార్థులు, నిరుద్యోగ అభ్యర్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను పూర్తి స్థాయిలో కల్పించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రె అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని గ్రంథాలయాన్ని డీఆర్‌డీపీ సురేందర్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సరితతో కలిసి సందర్శించారు. గ్రంథాలయ పరిసరాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయాన్ని రూర్బన్ పథకంలో భాగంగా నిర్మించారని, కావాల్సిన అదనపు పనుల కోసం ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. గ్రంథాలయాలను పాఠకులు, విద్యార్థులు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగ అభ్యర్థులకు అవసరమైన పత్రికలు, పుస్తకాలు, మెటీరియల్‌తో పాటు కనీస సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఆయన వెంట టీఎస్ ఈడబ్ల్యూ, ఐడీసీ ఇంజనీర్లు, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

అన్నివర్గాల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు



చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే

చింతలమానెపల్లి: అన్ని వర్గాలకు చెందిన ప్రజల అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నిర్వహించిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 114 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. పోడు రైతులకు అండగా ఉంటామన్నారు. అనంతరం మండలానికి చెందిన విద్యార్థులు నీట్, ఐఐటీలలో ర్యాంకులు సాధించడంతో వారిని ఎమ్మెల్యే సన్మానించారు. డిప్యూటీ తహసీల్దార్ మష్కూర్ అలీ, ఎంపీపీ డుబ్బుల నానయ్య, జెడ్పీటీసీ శ్రీదేవి, నాయకులు పాల్గొన్నారు.

కౌటాలలో..

కౌటాల: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తామని సిర్పూర్(టి) ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో వంద మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన అందరికి కల్యాణలక్ష్మి చెక్కులు పెండింగ్‌లో లేకుండా చూస్తామన్నారు. ఇక్కడి వారు ఇతర ప్రాంతాలకు పని నిమిత్తం వలసలు వెళ్లి మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత ప్రాజెక్టు పూర్తి చేస్తే వలసలు నివారించవచ్చని తెలిపారు. మండలంలో మారుమూల ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో సిర్పూర్ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. అనంతరం ఇటీవల మృతి చెందిన శ్యాంరావు కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్, ఎంపీటీసీలు శిరీష, దుర్గం మోతీరాం, బీజేపీ మండలాధ్యక్షుడు వానుపటేల్, జిల్లా నాయకులు బండి రాజేందర్‌గౌడ్, శ్రీశైలం, మాజీ జెడ్పీటీసీ ఎల్ములే మల్లయ్య, నాయకులు భీమన్న, రవీందర్, యశ్వంత్‌రావు, మధుకర్, చందు, మిథున్, భగవంతం, బండురావు, రావుజీ, గణపతి, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై ఎంపీపీ ఆగ్రహం

కౌటాల: మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో శుక్రవారం నిర్వహించిన కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి తనకు సమాచారం ఇవ్వలేదని ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ సమావేశంలోనే రెవెన్యూ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు అక్షరాభ్యాసం



కెరమెరి: అక్షరాలు దిద్దిస్తున్న ఎంఎస్‌వో ప్రకాశ్



ఆసిఫాబాద్‌అర్బన్: జన్కాపూర్ పాఠశాలలో..

కెరమెరి: మండలంలోని వివిధ గ్రామాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. బడిబాటలో భాగంగా ప్రాథమిక పాఠశాలల్లో చేరిన ఒకటవ తరగతి విద్యార్థులతో అక్షరాలు దిద్దించారు. ఎంఎస్‌వో ఆడే ప్రకాశ్, కాంప్లెక్స్ హెచ్‌ఎం చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు చేపడుతున్న బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతిలో ప్రవేశం పొందిన విద్యార్థులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి ఉదయ్‌బాబు మాట్లాడుతూ విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఉచితంగా పలకలు, పాఠశాలలో విద్యార్థులకు కావాల్సిన మెరుగైన సౌకర్యాలను కల్పించినట్లు పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయురాలు అరుంధతి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: బడిబాట కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం అక్షరాభ్యాసం నిర్వహించారు. ఒకటవ తరగతిలో ప్రవేశం పొందిన విద్యార్థులకు ఉపాధ్యాయులు పలకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రియాంక, చందన, అర్షియా, ప్రశాంతి, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని పులికుంట కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయులు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా సరస్వతీదేవి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎనిమిది మంది విద్యార్థులు నూతనంగా పాఠశాలలో ప్రవేశం పొందగా వారితో ఓనమాలు దిద్దించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు బుర్స లక్ష్మి, పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

వాంకిడి: మండలంలోని అర్జుగూడ పాఠశాలలో శుక్రవారం నూతనంగా ఒకటో తరగతిలో చేరిన విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ధర్మబాయి పిల్లలకు పలకలు అందజేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం రూమ్ టు రీడ్ ప్రాజెక్ట్ రాష్ట్ర పరిశీలకుడు నితిన్ కుమార్, జిల్లా అధికారిణి జెన్నిఫర్ రాణీ ఆధ్వర్యంలో మహాగాం ఉర్దు మీడియం పాఠశాల, ఖిరిడి ప్రాథమిక పాఠశాలలను సందర్శించి రూమ్ టు రీడ్ కార్యక్రమం అమలుపై సమీక్షించారు. కార్యక్రమంలో ఎంఈవో మనుకుమార్, ఉ పాధ్యాయులు రజిత, సాయినాథ్, జగదీష్, వినేష్, కోఆర్డినేటర్ రాజు, సీఆర్పీ సందీప్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన

కాగజ్‌నగర్‌రూరల్: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని జీవన్‌ధాన్ చారిటబుల్ ట్రస్ట్ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి స్పందన లభించింది. శిబిరంలో 40 మంది రక్తదాతలు పాల్గొని రక్తదానం చేశారు. ఈసందర్భంగా బ్లడ్‌బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్ కె.రాజేశ్ మాట్లాడుతూ శిబిరంలో రక్తదాతలు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. దాతలకు ఒక సంవత్సరం బీమా పాలసీ చేశామని పేర్కొన్నారు. ఈసందర్భంగా రక్తదాతలను ఘనంగా సన్మానించారు. ల్యాబ్ టెక్నీషియన్లు రఘు, శివ, రక్తదాతలు ఈర్ల సునీల్, శ్రీకాంత్, సాయి, ప్రవీణ్, సంతోష్, అమ్మ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

జైనూర్: ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి ఆదుకోవాలని ఎస్సై సందీప్‌కుమార్, ఆదివాసీ మిత్ర వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఆడ వెంకటేశ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివాసీ మిత్ర వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు.